క్లుప్తంగా

కోర్టు క్యాలెండర్ ఆవిష్కరణ



మైలవరం: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్ సౌజన్యంతో ఐఏఎల్ ఆంధ్రప్రదేశ్ శాఖ డైరీలు, క్యాలెండర్లను అన్ని బార్ అసోసియేషన్‌లకు అందేవిధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయమని మైలవరం జడ్జి శైలజ పేర్కొన్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐఏఎల్ కార్యదర్శి బుద్దవరపు వెంకట్రావు, న్యాయవాదులు ఎస్‌వీకే సత్యనారాయణరావు, రామకృష్ణ, ఏడీ ప్రసాద్, శ్రీనివాసరావు, రవికుమార్, రమేష్‌బాబు, జూనియర్ న్యాయవాదులు దినేష్, తనూజ, శివ, దివ్య, భావన, సుజీనీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు మంగళవారం ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లను అందజేస్తోందని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేశారు. నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



తిరువూరు: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తిరువూరు పట్టణంలోని పలు ఆలయాల్లో మంగళవారం విశేషపూజలు జరిగాయి. వేంకటాచల స్వామి దేవాలయంలో వైష్ణవ తదియారాధన, హనుమాన్ చాలీసా పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాజుపేట వీరాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజాదికాలను సంప్రదాయబద్ధంగా జరిపారు. కోదండ రామాలయం, రంగనాయకస్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

ఆగిరిపల్లి: వట్టిగుడుపాడులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, సిమెంట్ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉచిత వైద్యశిబిరం



లక్ష్మీపురం(తిరువూరు): కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం పాల శీతల కేంద్రంలో మంగళవారం పాల ఉత్పత్తిదారులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తిరువూరు ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రి, అకీరా కంటి ఆస్పత్రి వైద్యులు ఈ శిబిరంలో 300 మంది రైతులకు ఉచిత వైద్యపరీక్షలు చేశారు. పాల శీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి పర్యవేక్షించారు.

పారిశుద్ధ్యం కోసం జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో పారిశుద్ధ్య పరిస్థితి బాగోలేదని, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని పేర్కొంటూ గ్రామస్తులు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. మెయిన్ రోడ్డులో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, గౌడబజార్ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని గ్రామానికి చెందిన వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

చాట్రాయి: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కోటపాడులో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఆయన చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంచడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం జగనన్న సురక్ష కిట్‌ని రోగులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా సత్యనారాయణ, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీ పాల్గొన్నారు.



చాట్రాయి మండలం కోటపాడు వైద్య శిబిరంలో మందుల కిట్టు అందజేస్తున్న దేశిరెడ్డి

పేదల ఇంటి వద్దకే 'జగన్న ఆరోగ్య సురక్ష'

తోలుకోడు(మైలవరం): గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం తోలుకోడు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్యాఆరోగ్య సిబ్బంది ప్రతి ఒక్కరి గృహాన్ని సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్య పరీక్షలు చేయడం ద్వారా వారికి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఓబులురెడ్డి దుర్గారెడ్గిడ, ఎంపీడీఓ లక్ష్మీకుమారి, ఈఓపీఆర్డీ పద్మావతి, జిల్లా వైద్యాధికారి మాధవి, చంద్రాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక, తోలుకోడు కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు జగదీష్, నాయకులు బుర్రి ప్రతాప్, ఎలీషారావు, పంచాయతీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.



తోలుకోడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న గంగాధరరావు

గొల్లపూడిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మైలవరం ఎమ్మెలే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడి సచివాలయం–1 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 క్యాంప్‌ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలకు వారి ఇంటి ముంగిటిలోనే పరిష్కారం, వైద్య సేవలు లభించాయన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ చికిత్సల వ్యయాన్ని రూ. 25 లక్షలకు పెంచారని పేర్కొన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన సందర్భాలలో నెట్వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ బాధ్యతను పూర్తిగా ఫ్యామిలీ డాక్టర్, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు తీసుకుంటారన్నారు. అనంతరం పలువురు పేదలకు అవసరమైన మందులు, కళ్లజోళ్లను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పంపిణీ చేశారు.



గొల్లపూడిలో కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

గుంటుపల్లిలో..

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాలడుగు జోత్స్న కోరారు. గుంటుపల్లి సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పర్హాన్ నేతృత్వంలో బీపీ, మధుమేహం, కంటి పరీలు, ఈసీజీ, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఈఓపీఆర్డీ మనోజ్, గ్రామ కార్యదర్శి మునేశ్వరరావు, సచివాలయాల కో–ఆర్డినేటర్ కోసూరు వెంకటేష్ పాల్గొన్నారు.



గుంటుపల్లి జగనన్న ఆరోగ సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ జోత్స్న

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



గంపలగూడెం మండలం పెనుగొలనులో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



జి.కొండూరు మండలం వెలగలేరులో ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



ఆగిరిపల్లి మండలం నుగొండపల్లిలో క్రికెట్ ఆడుతున్న ఎంపీడీఓ శంకరరావు



నూజివీడు మండలం మీర్జాపురంలో షటిల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గంపలగూడెం మండలంలోని 21 సచివాలయాల్లో మంగళవారం నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొనేందుకు 264 టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, తిరువూరు నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త గుర్రం గోపాలరావు తెలిపారు. వీటిలో 141 పురుష, 123 మహిళా టీంలు ఉన్నాయని తెలిపారు.

పోటీలో 180మంది క్రీడాకారులు

జి.కొండూరు: మండలంలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించినట్లు ఎంపీడీఓ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించిన క్రికెట్, ఖోఖో పోటీలకు 13 జట్లకు సంబంధించి 180మంది క్రీడాకారులు పోటీపడినట్లు పేర్కొన్నారు.

హుషారుగా..

నూజివీడు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మండలంలో హుషారుగా కొనసాగుతున్నాయి. పల్లెర్లమూడి, మీర్జాపురం హైస్కూల్‌లో మంగళవారం షటిల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీడీఓ విజయ్‌కుమార్ ప్రారంభించారు. షటిల్ పోటీల్లో తక్కెలూరు సచివాలయం జట్టు ఎంపికైంది. ఈ పోటీలను పీడీ స్వప్న నిర్వహించారు. పట్టణంలో ఎస్ఆర్ఆర్ హైస్కూల్, ధర్మ అప్పారావు కళాశాల, సెయింట్ థామస్ హైస్కూళ్లలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ పర్యవేక్షించారు.

క్రీడాకారుల నైపుణ్యం గుర్తించడమే లక్ష్యం

ఆగిరిపల్లి: క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించడమే ఆడుదాం ఆంధ్రా లక్ష్యమని ఎంపీడీఓ శంకరరావు తెలిపారు. నుగొండపల్లి సచివాలయ పరిధిలో బ్లిస్ స్కూల్లో క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీలో నుగొండపల్లి, పోతవరప్పాడు గ్రామాల క్రికెట్ టీంలు పాల్గొన్నాయి. పంచాయతీ కార్యదర్శులు పుల్లారావు, ఉమాకాంత్ పాల్గొన్నారు.

వృద్ధులకు ఆత్మీయ ఆదరణ

పలువురు వృద్ధులు కుటుంబ సభ్యుల ఆదరణ కోల్పోవడంతో వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో నిరాదరణకు గురైన వృద్ధులను కాచవరంలో అమ్మానాన్న వృద్ధాశ్రమం చేరదీసింది. ఒకప్పుడు సినిమా రంగంలో ఓ వెలుగు వెలిగిన చలసాని వెంకటేశ్వరరావు 2000వ సంవత్సరంలో అమ్మానాన్న పేరుతో ఆశ్రమాన్ని నెలకొల్పారు. అప్పటి నుంచి ఎందరో వృద్ధులకు ఆశ్రయం కల్పించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారు.



కాచవరం వృద్ధాశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులు (ఫైల్)



కాచవరంలో ఉన్న అమ్మానాన్న వృద్ధుల ఆశ్రమం భవనాలు, సాయిబాబా మందిరం

ఇబ్రహీంపట్నం: అమ్మానాన్న ఆశ్రమంలో వృద్ధులకు ఆదరణతో పాటు ఆధ్యాత్మిక భావం, ధ్యానం చేసుకునే సదుపాయాలను నిర్వాహకులు చలసాని వెంకటేశ్వరరావు కల్పించారు. వృద్ధులకు అందిస్తున్న సేవలపై 2015లో 25వ జాతీయ ఓల్డర్స్, పెన్షనర్స్ డే పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ మెరిట్ సర్టిఫికెట్ లభించింది. 2021లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవానికి ప్రశంసాపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది.

23 ఏళ్లుగా ఆదరణ

తెలుగు చలనచిత్ర రంగంలో రాణించిన చలసాని వెంకటేశ్వరరావు సమాజ సేవకు పాటుపడాలని నిర్ణయించుకున్నారు. 2000వ సంవత్సరంలో కాచవరంలో సుమారు రూ.లక్ష వ్యయంతో ఆశ్రయం నెలకొల్పారు. తొలిరోజుల్లో 10 మంది వృద్ధులతో ఆశ్రమం ప్రారంభించి 23 ఏళ్లలో ఎంతోమంది వృద్ధులు, అనాథలకు ఆదరణ చూపారు. ప్రస్తుతం 50మంది ఆశ్రమంలో ఉన్నారు. ప్రతిరోజూ మూడు పూటలా ఆహారం (ఒక్కొక్క రోజు దాతల సహకారం), వినోదానికి టీవీ, ఆధ్యాత్మిక భావాలకు ఆశ్రమంలోనే సాయిబాబా ఆలయం, శ్రీకృష్ణ మందిరం, ధ్యాన కేంద్రం ఏర్పాటు చేశారు.

చిత్రపరిశ్రమ నుంచి సామాజిక సేవకు

విజయవాడకు చెందిన చలసాని వెంకటేశ్వరరావు 1955వ ఏడాది తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రవేశించారు. విఠలాచార్య దర్శకత్వంలో 'కరుణించిన కనకదుర్గ', భరద్వాజ డైరెక్షన్‌లో 'నేటిరౌడీయిజం' వంటి చిత్రాలు నిర్మించారు. అనంతరం జగపతి ఫిలిం డిస్ట్రిబ్యూటర్ సంస్థను స్థాపించి ఎన్టీఆర్ నటించిన కృష్ణార్జునయుద్ధంతో పాటు పలువురి హీరోల చిత్రాలు కొనుగోలు చేసి జిల్లా డిస్ట్రిబ్యూటర్లకు పంపిణీ చేశారు. సమాజానికి ఏదైనా చేయాలనే తలంపుతో వృద్ధాశ్రమం నెలకొల్పి వృద్ధులతో పాటు అక్కడే ఉంటున్నారు.

పిల్లలకు భారం కాకూడదని ఆశ్రమంలో ఉన్నా



పక్షవాతంతో ఐదేళ్ల క్రితం భర్త మృతి చెందాడు. నలుగురు ఆడపిల్లలకు వివాహాలు చేశాం. ఆడపిల్లలకు భారం కాకూడదని నిర్ణయించుకున్నాను. అమ్మానాన్న వృద్ధాశ్రమంలో వారు చేర్చారు. ఆశ్రమంలో సదుపాయాలు బాగానే ఉన్నాయి. తోటి నిర్వాసితులతో హాయిగా జీవితం గడిచిపోతుంది.

– ఎస్.సీతమ్మ, కొండపల్లి


వృద్ధుల సేవలో తరిస్తున్నా




సినిమా పరిశ్రమలో సంపాదించిన డబ్బు నీళ్లప్రాయంగా కరిగి పోయింది. సామాజిక సేవ చేయాలని తలంపుతో ఆశ్రమం నెలకొల్పాను. వృద్ధులను ఆదరిస్తున్న తృప్తి మిగిలింది. ఆశ్రమంలో వయోభారంతో మృతి చెందిన వారిని తీసుకెళ్లేందుకు రాని కుటుంబ సభ్యులను చూస్తే బాధగా ఉంటుంది.

– సీహెచ్.వెంకటేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి



తోటమూలలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న కోట శామ్యూల్

మూలపాడు(ఇబ్రహీంపట్నం): జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక నేతృత్వంలో రూపొందించిన స్టడీమెటీరియల్ ఉపయోగించుకుని టెన్త్‌క్లాస్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జెడ్పీ వైస్ చైర్మన్ గరకిపాటి శ్రీదేవి అన్నారు. మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో సమకూర్చిన స్టడీ మెటీయల్ 220 మంది టెన్త్‌క్లాస్ విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలల రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోండి

తోటమూల(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ హారిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, మంచి మార్కులు సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్ తెలిపారు. మండలంలోని తోటమూల ఏపీ మోడల్ స్కూల్లో మంగళవారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, బాలు, ఎస్ఎంసీ చైర్మన్ ఇమ్మానుయేలు, ప్రిన్సిపాల్ రేవు శైలజ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి వారధులం కావాలి

ముసునూరు: ప్రపంచ శాంతికి మనమంతా వారధులం కావాలని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు, మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి కంబాల రాంబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఫెలోషిప్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కాట్రేనిపాడు నూతన హోలీ సీఎస్ఐ మందిరంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏసుదాసు, ప్రభుకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రపంచ శాంతి సందేశాన్ని అందించారు. ప్రపంచమంతటా శాంతి వర్ధిల్లడానికి మనమంతా కృషి చేయాలని కోరుతూ తెల్ల బెలూన్లను, పావురాలను ఎగురవేశారు. చింతలవల్లి ఆర్‌సీఎం ఉపదేశి డి.బెనర్జీ ప్రపంచ శాంతికి భారతదేశం చేస్తున్న కృషిని బాలలకు వివరించారు.

జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జనవిజ్ఞాన వేదిక 2024 క్యాలెండర్‌ను జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ వైద్యశాల వైద్యుడు మామిడి సీతారామారావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు కామేశ్వరరావు, కొండపల్లి శాఖ అధ్యక్షుడు నాగరాజు, సర్దార్ సాహెబ్, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

రేపు దేవస్థానం దుకాణాలకు వేలం పాట

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని దుకాణాలకు గురువారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో వేలం పాట నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని తెలిపారు. స్థానిక పెద్ద కొట్టాయం సమీపంలో నూతనంగా నిర్మించిన రెండు దుకాణాలు, రథశాల పక్కన ఉన్న మూడో దుకాణానికి వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు రూ.20 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆమె తెలిపారు.

నేడు పెరిగిన పింఛన్ల పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.3 వేలు పింఛన్‌ను బుధవారం ఉదయం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పెరిగిన పింఛన్‌లను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నారు. మండలం పరిధి గ్రామాల ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

గంపలగూడెం: ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల విజయవంతానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పథకాలపై డీడీఓలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 5వ తేదీన జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమం మండలంలో ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం వారానికి రెండు రోజులు గ్రామాల్లో సురక్ష కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. వైఎస్సార్ సామాజిక పెన్షన్లు పంపిణీని మండలంలో ఈ నెల ఆరో తేదీన నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం



చాట్రాయి: ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు అత్యవసరమని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో స్థానిక దళితవాడ వద్ద తన సొంత నిధులు రూ.50 వేలతో నిర్మించిన బస్ షెల్టర్‌ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశిరెడ్డి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నూజివీడు: విజ్ఞాన భారతి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కౌశల్–2023 క్విజ్ పోటీల్లో మండలంలోని పల్లెర్లమూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. విద్యార్థులు వడ్లమాను సామంత్ కుమార్ (పదో తరగతి), బాణావతి ఈశ్వర్ నాయక్ (తొమ్మిదో తరగతి), గరికముక్కు ప్రసన్నరాణి (8వ తరగతి) క్విజ్ పోటీల్లో సత్తా చాటి తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చీఫ్ విప్ సామినేని ఉదయభాను, ఎస్ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు రూ.9వేల నగదు బహుమతిని, జ్ఞాపిక, ప్రశంసా పత్రంను అందుకున్నట్లు హైస్కూల్ హెచ్ఎం సీహెచ్‌యూవీ హనుమంతరావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ పులపాక సౌమ్యరేఖ, ఎంపీటీసీ చిలుకూరి అనూర్ బాషా, పాఠశాల పీఎంసీ చైర్మన్ సుందరరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కౌశల్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, పాఠశాల కౌశల్ కోఆర్డినేటర్ జే విజయరత్నబాబు, వి వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రావు, పార్థసారథి పాల్గొన్నారు.

కళాకారుల ప్రతిభకు గుర్తింపునివ్వాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల్లోని ప్రతిభకు గుర్తింపునివ్వాలని విజయశ్రీ సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపకుడు బండారు నరసింహరావు అన్నారు. విజయశ్రీ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో కళాకారులకు ఆత్మీయ సత్కారం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ ప్రతీ ఏటా కళా సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ సాంస్కృతిక సేవా సమితి నిర్వహించే కార్యక్రమాలను అభినందించారు.